వంశీ గ్రంథాలయం, హైదరాబాదు వారు నిర్వహించిన వంశీ అండ్ బర్కిలీ అవార్డ్స్ ఉత్సవం 1978 కథల పోటీలో తృతీయ స్థానాన్ని పొందిన కథానిక.

# కుంకుమ బొట్టు

**"త్వ**రగా పెళ్ళికూతుర్ని తీసుకురండి" పెళ్ళి మంటపంలోంచి పురోహితుడు కేకలు పెడుతున్నాడు.

"సంధ్యా – ఇంకా చీర కట్టుకోవడం అవ్వలేదుటే, అవతల బేపనాయన కేకలు పెడుతున్నాడూ" అంది సంధ్యా వాళ్ళక్క.

"వస్తున్నానే బాబూ" అంటూ వచ్చి మొఖానికింత స్నో పౌడర్లు రాసుకుని తయారయింది సంధ్య.

"నువ్విలా తిన్నగా కూర్చో, కళ్యాణం బొట్టు పెడతాను" అంటూ కూర్చోబెట్టింది నిలువుటద్దం ముందున్న స్టూల్ మీద.

"బాగా పెట్టాలండి వదినగారూ. లేకపోతే ఫోటోల్లో పిల్ల ఆంజనేయుళ్ళా పడుతుంది మా చిన్న వదినగారు" ఎవరో హాస్యమాడారు.

నాలిక బయటపెట్టి సంధ్య వాళ్ళని వెక్కిరించింది.

"ఇప్పుడచ్చం కోతిలానే వుంది మా వదిన"

మళ్ళీ అంతా నవ్వారు!

"నువ్వు తిన్నగా వుండవే" అంటూ అక్కగారు కళ్యాణ తిలకం పెడుతోంటే బుద్ధిగా కూర్చున్న సంధ్యకి ఇదివరకు జరిగిన ఓ సంఘటన గుర్తొచ్చింది.

కాలేజీ వార్షికోత్సవ సందర్భంగా ప్రదర్శిస్తోన్న నృత్య నాటిక ఆఖరిభాగంలో పాల్గొనడానికి పెళ్ళికూతుర్లా తయారై గ్రీన్‌రూమ్‌లోంచి హడావుడిగా తను వస్తోంటే ఆ నాటిక నిర్వాహకుడూ దర్శకుడూ అయిన లెక్చరర్ చంద్రంగారు, "కళ్యాణ తిలకం పెట్టుకున్నావా సంధ్యా" అనడిగారు.

"అయ్యో మర్చిపోయానండీ"

"అది మర్చిపోతే ఎలా చెప్పు" అంటూ గ్రీన్‌రూమ్‌లో కెళ్ళి తిలకం తెచ్చి "ఇఫ్ యూ డోంట్ మైండ్" అంటూ తన నుదుటున కళ్యాణబొట్టు దిద్దారు.

సంధ్య పెదవుల మీద చిరునవ్వుల మల్లెలు విరిశాయి.

"మా వదిన గారిప్పుడే ఊహాలోకంలో వూరేగుతున్నట్టున్నారే"

చుట్టూవున్న ఆడవాళ్ళ నవ్వులకి ఇహానికొచ్చి సిగ్గుపడింది సంధ్య.

పెళ్ళి కూతుర్ని త్వరగా తీసుకు రావాలి" పురోహితుడన్నాడు మళ్ళీ. ఓ పెళ్ళి పెద్ద వచ్చి "త్వరగా తీసుకురండమ్మా" అన్నాడు.

అక్కగారు నడిపిస్తోంటే అడుగులో అడుగు వేసుకుంటూ అవనతముఖియై ఎన్నెన్నో అనుభూతుల మేలు కలయికతో శరీరం పులకరిస్తోంటే కళ్యాణ మంటపం దగ్గిరకెళ్ళింది సంధ్య. ఆమె చెవుల్లో మనసులో సన్నాయి తీయని స్వరాలు ఆలపిస్తోంటే తన్మయత్వమనుభవించిందామె. పెళ్ళి క్షణాలెంతటి అపూర్వమైనవో ఆమెకప్పుడే తెలిసొస్తున్నట్టుగా వుంది. నిజానికది అనిర్వచనీయమైన అనుభూతి! ఆనందం!

'ప్రధానం' అయ్యాక పెళ్ళికొడుకుని తీసుకురండన్నారు.

క్రీగంట కళ్యాణమంటపం మెయిన్ గేటు వైపు చూసింది సంధ్య.

ఠీవిగా రాజసం ఒలికిస్తూ ప్రపంచాన్ని జయించి వస్తోన్న వీరుళ్ళా, మత్స్య యంత్రాన్ని కొట్టిన అర్జునుళ్ళా వస్తోన్న చంద్రం కంటబడేసరికి ఆమె మనస్సు ఆనంద నాట్యం చేసింది.

ఇంతలో మరో ఫ్లాష్ --

అప్పుడు తను బి.యస్సీ సెకండియర్ చదువుతోంది. అవాళ తమ క్లాసుకి కొత్త జువాలజీ లెక్చరర్ వస్తున్నాడు. క్లాసులో ఆడపిల్లల సంఖ్య ఎక్కువేమో తను అసలే అల్లరిపిల్లేమో కొత్త లెక్చరర్నో ఆట ఆడించాలని అందరికీ చెప్పింది. అంతా ఒప్పుకున్నారు.

కొత్త లెక్చరర్ చంద్రం వచ్చాడు క్లాసుకి. కొంచెం వణకుతూ తన గురించి చెప్పుకుని పాఠం మొదలుపెట్టాడు. నాలుగు ముక్కలు చెప్పాడో లేదో సంధ్య అడ్డుప్రశ్న వేసింది. మరొకళ్ళు మరో ప్రశ్న. ఇంకొకళ్ళు ఇంకో ప్రశ్న. చంద్రం మీదికెన్ని ప్రశ్నల బాణాలు సంధించారో వాళ్ళకే తెలీదు. కానైతే వాటన్నిటికీ అతడు తడుముకోకుండా సమాధానాలిచ్చేడు, మరెంత బాగా ప్రిపేర్ అయ్యాడో ఏమో గాని క్లాసయ్యాక అంతా అతడ్ని గొప్పగా పొగిడేస్తోంటే ఓడిపోయిందాన్లా ఫీలయ్యింది తను!

మళ్ళీ నవ్వొచ్చింది సంధ్యకి.

"ష్...నవ్వకే బాబూ" అక్క చెవిలో వూదడంతో సరిగ్గా సర్దుకు కూర్చుంది.

పెళ్ళి తతంగం మొదలయ్యింది.

ఏవేవో పూజలు చెయ్యమంటోంటే చేస్తూ ఓసారి క్రీగంట చంద్రం వంక చూసింది.

అతడు కళ్ళతో నవ్వాడు విజయగర్వంతో.

ఆమె సిగ్గుపడింది.

మరో ఫ్లాష్...

అవాళ క్లాసులో చంద్రంగార్ని ప్రశ్నలతో ఏడ్పించాక, ఆ మర్నాడు జువాలజీ లాబ్‌లో మండ్రగప్పతో కుస్తీ పడుతోంటే "బాగా వస్తోందా" అంటూ వచ్చాడు. తనకసలే

ఈ కప్పల్నీ తేళ్ళనీ కొయ్యడం మాటెలా వున్నా ముట్టుకోవడమంటేనే వణకూ దడానూ. అయినా తన లోసుగు కన్పించకూడదని గబగబా కోస్తోంటే తోక కాస్తా కట్ అయికూర్చుంది.

"అరె – అంత స్పీడు పనికిరాదండీ" అంటూ అటెండర్ని పిలిచి మరోటి తెప్పించి, ఎలా కట్ చేసి నెర్వస్ సిస్టమ్ ఎక్స్‌పోజ్ చెయ్యాల్సిందీ చిన్నపిల్లకి వివరించి చెప్పినట్లుగా చెప్పేడు.

దాంతో తనకెంతో సిగ్గేసిపోయింది. వాలుగా అతడ్ని చూసేసరికి ఇదిగో ఇందాట్లానే గర్వంగా నవ్వుతున్నాడు.

ఆ తర్వాత అప్పుడప్పుడూ ఏవో రొటీన్‌కి సంబంధించిన సంభాషణలే నడిచాయ్ తమ మధ్య. కాలేజీ వార్షికోత్సవ సందర్భంగా ఓ నృత్య నాటికను వేయిస్తూ తనని హీరోయిన్‌గా వెయ్యమన్నారు చంద్రంగారు.

"బాబోయ్ – స్టేజ్ అంటేనే నాకు బీపీ, హై టెంపరేచర్ వగైరా వగైరా వచ్చేస్తాయండి బాబు. మీకూ మీ నాటకానికీ ఓ దండం గాని నన్ను వదిలెయ్యండి" అంది తను.

"మీలాటి చలాకీ అమ్మాయి అలా భయపట్టం బావోలేదు. మీరు వేసి తీరాల్సిందే" అయన్తోబాటు క్లాసు వాళ్ళంతా పట్టుబట్టారు.

ఇక గత్యంతరం లేక ఏడ్వలేక నవ్వి ఒప్పుకుంది. నటన కొత్త అయినా బ్రహ్మాండంగా నటించింది కూడా. రిహార్సల్స్ సందర్భంలోనే చంద్రం గారితో పరిచయం పెరిగింది....

"సరిగ్గా పూజ చెయ్యవమ్మా"

పురోహితుడి మందలింపుకి ప్రస్తుతానికొచ్చి తన పరధ్యానానికి తిట్టుకుంటూ అతడు చెప్పినట్లల్లా బుద్ధిగా చెయ్యసాగింది సంధ్య.

"టైమెంతయ్యింది బాబూ"

"మూడూ పదిహేను"

"మూడూ ఇరవైకే కదూ ముహూర్తం?" అంటూ జీలకర్రా బెల్లం సిద్ధం చేయించి ఆ టైముకి ఒకరి శిరస్సుమీద ఒకరిచేత జీలకర్రా బెల్లం ముద్దల్ని పెట్టించాడతడు.

ముహూర్తమంటే మంగళసూత్రధారణ సమయమనుకుందిగాని జీలకర్రా బెల్లాల్ని వుంచడమనుకోని సంధ్య చాలా ఆశ్చర్యపడింది. ఆ పైన జీలకర్రా బెల్లంలా కలిసిపొమ్మని దాని అంతరార్థం అనుకునెంతో ఆనందపడింది. అంతేకాదు. ఆ కార్యక్రమంతో పెళ్ళై పోయినట్లే గనుక ఆమె తనువు పులకించి పోయింది కూడానూ.

సూత్రధారణ కూడా అయ్యింది.

తలంబ్రాల ఘట్టంలో చంద్రంతో పోటీపడింది సంధ్య – వెనకున్న ఆడవాళ్ళు

వారిస్తున్నా వినకుండా.

అరుంధతిని చూపిస్తానంటూ వధూవరుల్ని తీసుకెళ్ళడాని కుద్యుక్తుడయ్యాడు పురోహితుడు. చంద్రం సంధ్య చిటికెన వేలినందుకుని నడుస్తోంటే అతడి వెంట చకచకా అడుగులేసిందామె.

అనుకోకుండా ఓ సంఘటన గుర్తొచ్చిందామెకి.

వార్షికోత్సవం అయిపోయాక ఓ రోజున చంద్రం గారు తను ఒంటరిగా వుండటం చూసి వచ్చి, "మీతో కొంచెం మాట్లాడాలి. మీకిప్పుడేం పనుల్లేకపోతే అలా బీచ్‌కెళదాం వస్తారా?" అన్నాడు.

క్లాసులోనూ ఫ్రండ్స్‌తో వున్నప్పుడూ తెగ అల్లరి చేసే తనకాక్షణంలో ముచ్చెమటలు పోశాయ్. నోట మాట రాలేదు. అతడు రెట్టించి అడగడంతో అతి బలవంతం మీద అతడి వెంట నడిచింది పార్కుకి – ఓప్రక్క నెర్వస్‌గా ఫీలవుతూనే.

"మీరేమీ అనుకోనంటే మీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి"

ఏమిటన్నట్టు చూసింది తను.

"నా గురించి మీకు తెలుసనుకుంటాను. యమ్మెస్సీ చదివాను. నా జాబ్ గురించి జీతం గురించీ మీకు తెలిసిందే. మా ఫాదరూ వాళ్ళది ఓ పల్లెటూరు. వ్యవసాయం ప్రధానవృత్తి. ఇద్దరు అన్నదమ్ములం. అక్కచెల్లెళ్ళు లేరు"

అవన్నీ ఎందుకు చెబుతున్నాడో అర్థంగాక విస్తుబోయి చూస్తోంటే "ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే మీకిష్టమైతే మీ వాళ్ళతో మాట్లాడి మిమ్మల్ని పెళ్ళి చేసుకుందామనీ..." అన్నాడు.

నిశ్చేష్టయై శిలా ప్రతిమలా వుండిపోయింది కొంచెంసేపు.

తర్వాతంతా మరోసారి మననం చేసుకునేసరికి సంతోషం ఎక్కడా ఆగలేదు. చంద్రంగారు చంద్రం అయ్యాడు. తమ ప్రతిపాదనని పెద్దవాళ్ళు ఒప్పుకున్నారు తేలిగ్గా సంతోషంగా...

"హనీమూన్ గురించా ఈ దీర్ఘాలోచన?"

చెవిలో అన్న చంద్రం మాటలకి వులిక్కిపడి కోపంగా చూసి సిగ్గుపడి మళ్ళీ తన పరధ్యానానికి తిట్టుకుని ఆపైన నవ్వుకుంది సంధ్య.

* * *

శోభనం రాత్రి అన్నాడు చంద్రం సంధ్యతో, "పెళ్ళిలో నాతిచరామి అని ముమ్మారు అన్పించారు. కష్టంలో సుఖంలో ఎప్పుడూ ఎలాంటి పరిస్థితుల్లోనూ నిన్ను వదలను, సంధ్యా. జీవితాంతం యిలా చెయ్యీ చెయ్యీ పట్టుకునే నడుస్తాం. ఇది నిజం"

ఆమెకెందుకో గబుక్కున కళ్ళు చెమ్మగిల్లాయ్. తన భావం, కోరిక, తపన అన్నీ అందుకేనని మూగగా చెప్పింది అతడి గుండెల మీద వాలిపోతూ సంధ్య.

హనీమూన్ కెళ్దామని ప్లాన్ వేసుకొంటోంటే "ముందు అంతర్వేది వెళ్ళిరండి. నేను మొక్కుకున్నా"నంటూ పట్టుబట్టింది చంద్రం వాళ్ళ బామ్మ. దాంతో హనీమూన్‌ని వేసవికి పోస్టుఫోన్‌చేసి అంతర్వేదికి బయల్దేరారు సంధ్యా చంద్రమూనూ.

నర్సాపూర్‌లో లాంచీ యెక్కి ఆ సరిక్రొత్త ప్రయాణ సుఖాన్నాస్వాదిస్తూ అంతర్వేది వెళ్ళారు. సూర్యాస్తమయానికెంతో వ్యవధి లేకపోవడంతో ఆ దృశ్యాన్ని సముద్రంలో చూడాలన్చెప్పి, చేలల్లోంచి ఇసుకు తిప్పల్లోంచి నడిచి సముద్రం దగ్గర కెళ్ళారు. సూర్యుడు సముద్రంలో కలవడం చూసేపరికి చంద్రానికెంతో బాధేసింది!

"పొద్దుటా సాయంత్రమూ కూడా ఒకే రకపు సంధ్య. ఒకే రకపు వెలుగు. కాని పొద్దుటి సంధ్య తర్వాత వెలుగు వస్తే, సాయం సంధ్య తర్వాత చీకటి వస్తుంది. రెంటికీ ఎంత తేడాయో చూడు"

తర్వాత చాలసేపక్కడే సముద్రపు హోరు వింటూ చల్లనిగాలి ననుభవిస్తూ వెన్నెల్లో తడుస్తూ ఎన్నెన్నో కబుర్లూ కలలూ వూహలూ పండించుకొంటూ ఒకరి ఒడిలో ఒకరు తలపెట్టుకునుండి పోయారు ఏకాంత సమాధిలో.

ఆ పిమ్మట తీర్థం చూసి, దేవుడ్ని దర్శించి తిరిగి వచ్చారు.

* * *

సంధ్యని కాపురానికి తీసుకొచ్చారు చంద్రం వాళ్ళ నాన్నగారు.

ఆమె తమ ఇంట అడుగు పెట్టగానే పోతుందనుకున్న కోర్టు కేసు గలవడం, ఆ ఏడు పంటలు బ్రహ్మాండంగా పండడంతో, "మా కోడలు మహాలక్ష్మి" అని మురిసిపోయి అందరికి గొప్పగా చెప్పుకున్నారు కూడా. చదువుకున్న పిల్లయినా పిసరంత గర్వం కూడా లేదనీ అదనీ ఇదనీ ఆమె అత్తింటి వాళ్ళంతా ప్రశంసలతో ముంచెత్తారు.

సంధ్యా వాళ్ళన్నయ్య వాసుకో సంబంధం వచ్చింది. అతడికి చెల్లెలి మీదెంతో గురీ గౌరవమూనూ. అంచేత ప్రత్యేకంగా వచ్చి తన పెళ్ళిచూపులకి ఆమెని కూడా తీసుకెళ్ళాడు. ఆడబిడ్డ హోదాలో అక్కడి కెళ్ళి ఆ అమ్మాయిని ప్రశ్నలతో భయపెట్టి కలవరపెట్టి ఆఖరికి బావుందంటూ సర్టిఫికెట్ ఇవ్వడమే గాక, వెంటనే తమ అభిప్రాయాన్ని చెప్పించింది. తాంబూళాలు పుచ్చుకునేట్టు చేసింది కూడా. అంతవరకూ ఆమెని వింతగా చూసిన ఆ వియ్యాలవారు అమాంతం ఆమెని ఆకాశానికెత్తేశారు.

పెళ్ళవడంతోనే చదువుకి స్వస్తి చెప్పిన సంధ్య చంద్రం దగ్గరికి కాపురానికొచ్చింది.

క్రొత్త సంసారం – క్రొత్త కోర్కెలు – క్రొత్త సరదాలు – క్రొత్త అందాలు – క్రొత్త ఆనందాలు – క్రొత్త బాధ్యతలు.

వీటన్నిటితో క్రొత్తగా ఫీలవుతూంటే పెళ్ళికో సమర్తకో మరో శుభకార్యానికో వాళ్ళకి పిలుపులొస్తున్నాయ్ ముఖ్యంగా సంధ్యకి. ఆమె చాలా చలాకీ పిల్ల అనీ ఎలాంటి కార్యమైనా చక్కగా చక్కబెడుతుందనీ బంధువర్గపు ఏకాభిప్రాయం!

*   *   *

స్పాట్ వేల్యూయేషన్‌కి హైదరాబాద్ వెళుతోన్న చంద్రానికి వీడ్కోలు చెప్పడానికి రైల్వేస్టేషన్‌కి వచ్చింది సంధ్య. ఆమెకెంచేతో ఎన్నడూ లేనంత దిగులుగా అయోమయంతో కూడిన భయంగా వుంది. బహుశా ఓ పదిరోజులు దూరంగా వుండాల్సి రావడం ఇదే ప్రథమం అవడం వల్ల కావొచ్చు.

"ఏమిటి డియర్ అలా వున్నావ్"

"ఏం లేదండీ వెళ్ళగానే క్షేమంగా జేరినట్టు ఉత్తరం రాస్తారు కదూ?"

"ఉత్తరం ఏమిటి ఏకంగా టెలిగ్రామే ఇచ్చేస్తాను"

"హాస్యం కాదు"

"నిజమే సంధ్యా. నువ్వు మాత్రం ఇప్పుడే మీ పుట్టింటి కెళ్ళిపో. నేను రోజుకో ఉత్తరం రాస్తూంటాన్లే. పది రోజులు పది క్షణాల్లా గడుస్తాయ్. రైలెక్కేనుగా ఇక నేనెలావోలా పోతాన్లే గాని నువ్వెళ్ళిరా"

"అవేం మాటలండీ వెళ్ళొస్తాననండి" నొచ్చుకుంటూ అంది.

"సారీ – ఏదో అలా వచ్చేసింది. అయినా చదువుకున్నదానివి నీకిన్ని సెంటిమెంట్స్ వుండకూడదు"

గార్డు విజిల్ వేశాడు. ట్రెయిన్ కూత వేసి కదిలింది.

"సంధ్యా – బై బై..."

వెళ్తోన్న ట్రెయిన్లోంచి చేయి వూపుతూ అన్నాడు. తనూ యాంత్రికంగా వూపినా అతడు శాశ్వతంగా "బై బై" చెబుతున్నట్టుగా పిచ్చి భ్రమ కలిగి భోరున ఏడ్చేసింది సంధ్య!

సూట్‌కేస్‌తో వచ్చిన సంధ్యని చూచి, ఆమె తల్లిదండ్రులూ తోబుట్టువులూ ఆమె ఓ వారం రోజులుంటుందని విని ఎంతో ఆనందించారు. ఆమె అన్నయ్య వాసు గురించి చెప్పనే అక్కర్లేదు "సమయానికొచ్చావే సంధ్యా. అసలు నేన్నీకోసం వద్దామనుకుంటున్నాను తెలుసా"

"ఎందుకురా"

"ముహూర్తాలు పెట్టేశారే. వచ్చే నెలలోనే పెళ్ళి. బట్టల సెలక్షన్ నుంచి పెళ్ళి పనులన్నీ నీ చేతుల మీదే జరగాలిగా"

"మరి నాకేమిస్తావురా అన్నాయ్"

"నీకు ఆడబడుచు కట్నం వస్తోంది కదే"

"అదేం చాలదుగాని మీ మావగారు మొదటి పండక్కి ఇచ్చిన డబ్బులో సగం నా కిచ్చెయ్యాలి"

గత్యంతరం లేక తలూపుతూ "మరి ఏ వస్తువో ఇస్తే..." అని గొణిగాడు వాసు.

"ఆ వస్తువంతా ఇచ్చెయ్యాలి"

"బాబోయ్!"

అంతా ఘొల్లున నవ్వారు.

ఆ సాయంత్రం తాను ఫలానా ట్రెయిన్‌కి వస్తున్నట్టు ఉత్తరం రాశాడు చంద్రం.

సంధ్య సంతోషాని కవధుల్లేక పోయాయ్. సాయంత్రం దగ్గర పడుతోన్న కొద్దీ ఆమెలో ఒక రకమైన ఉద్వేగం పెరగసాగింది.

చీకటి పడటం పాపం గబగబా స్నానం చేసి తనకెంతో ఇష్టమైన తెల్ల చీర కట్టుకుంది. తలనిండా మల్లెపూలు తురుముకుంది. మొఖంమీద ఎర్రని తిలకం దిద్దుకుంటూ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకునెంతో మురిసిపోయింది. అసలే తనది గుండ్రటి మొఖమేమో ఎర్రబొట్టు ఎంతో కళనీ నిండుతనాన్నీ ఇస్తోంది!

పెళ్ళైన కొత్తలో తాను చీర రంగుకి మేచ్ అయ్యే బొట్టు ధరిస్తానంటే, "అవేం వద్దు. ఎర్రబొట్టే నీ మొఖానికి ప్రాణం" అన్న భర్త మాటలు గుర్తొచ్చి తీయగా సిగ్గుపడింది.

బయట వెన్నెల విరగ కాస్తోంది. గదిలో అగరువత్తులు వెలిగించి మరీ పచార్లు చేస్తోంది సంధ్య భర్త కోసం ఎదురు చూస్తూ. అనుకోకుండా ఆమె పెదాల మీద "నీకోసం వేచితినోయి అభిసారికనై – ఓ ప్రియా..." అన్నపాట కదిలింది. ఆ పిమ్మట హాయిగా నవ్వుకుని పెళ్ళైన కొత్తలో జరిగిన సంఘటనలు తలచుకుంటూ పడుకుంది.

ఏ చిన్న చప్పుడైనా సరే చంద్రం వచ్చాడేమోనని చూస్తూ నిరాశ చెందుతూ ఆ రాత్రి కలత నిద్ర పోయిందామె. మల్లెలు జడలోనే వుంచెయ్యడంతో తెల్లారేసరికి వాడి నలిగిపోయాయి. వాటిని  చూసి గిల్టీగా ఫీలయ్యిందామె.

'ఆయనెందుకు రాలేదో' అని ఇదవుతోంటే ఆయన వస్తానన్న ట్రెయిన్‌కి యాక్సిడెంట్ అయ్యిందనీ, చాలామంది చనిపోయారనీ, మరి చాలా మందికి గాయాలు అయ్యాయనీ ఓ ఘోరవార్తని తెచ్చింది న్యూస్ పేపర్. అది చదివి స్పృహ తప్పి పడిపోయింది సంధ్య! అంతా పరుగునొచ్చి నీళ్ళు చల్లారు. స్పృహ వచ్చింది గాని ఒకటే కలవరింతలు!

మధ్యాహ్నం వేళ పోలీస్ స్టేషన్ నుంచి ఓ మనిషొచ్చి ట్రెయిన్ యాక్సిడెంట్లో చనిపోయిన ఒకరి జేబులోని పాకెట్‌బుక్‌లోని ఎడ్రస్ చూస్తే లెక్చరర్ చంద్రం గారిదనీ, కాలేజీలో కనుక్కుంటే వారి ఎడ్రస్ ఇచ్చారనీ చెప్పేడు.

అంతా భోరున ఏడుస్తూ వార్తని చంద్రం వాళ్ళ నాన్నగారి క్కూడా కబురంపి టాక్సీలో ప్రమాదం జరిగిన చోటుకి దగ్గర్లో వున్న ఆసుపత్రికి వెళ్ళారు.

తమ గురించి వివరాలు చెప్పగా పర్సు, ఓ చిన్న పుస్తకం ఇచ్చారు. వాటిని చూస్తూనే గుర్తు పట్టింది. అవి తన భర్తవే. పర్సులోంచి తన ఫోటో జారిపడింది. గుండెలువే పగిలేలా ఏడ్చింది సంధ్య!

తర్వాత వాళ్ళు తల, ఛాతీ గుర్తు పట్టలేనంతగా చితికిపోయి వున్న శవాన్ని చూపి ఆ శవం జేబులోనే దొరికిందన్నారు.

చంద్రం తల్లీ తండ్రీ కూడా వచ్చేక, మరి చేసేదేంలేదు గనుక శవానికక్కడే దహన సంస్కారాలు చేసేశారు.

పిమ్మట తమతో సంధ్యని తీసుకెళ్తామన్నారు చంద్రం తండ్రి.

ఆయన అంతరార్థం ఎరిగిన సంధ్య కన్న వాళ్ళూ తోడ బుట్టిన వాళ్ళూ ఇరవై రెండేళ్ళైనా పూర్తిగా నిండని సంధ్యకి – చక్కగా చలాకీగా నవ్వుతూ తుళ్ళుతూ తిరిగే సంధ్యకి పట్టబోయే దుర్గతిని తలచి కన్నీరు మున్నీరుగా ఏడ్చారు.

వాసు "నా చెల్లెలి నుదుటి కుంకుమ తుడవడానికి వీల్లేదు. దాన్ని విధవని చెయ్యడానికి నే నొప్పుకోను" అన్నాడు ఆవేశంగా.

కాని అది తమ సాంప్రదాయమనీ, దానిని దాటటం కాదనటం అప్రతిష్ఠ యనీ ఏవేవో మిథ్యా కబుర్లు చెప్పి అతడి నోరు మూయించారు.

సంధ్యని తీసుకుని బయల్దేరారు ఆమె అత్తమామలు.

* * *

తెల్లవారితే పెద్ద కర్మ రోజు.

చీకటితోనే సంధ్యని లేపింది వాళ్ళమ్మ. లేపి ఏడ్చింది. మరికొందరాడవాళ్ళూ ఏడ్చారు. విషయం అర్థంగాకపోయినా తనూ ఏడ్చింది. కాని బయట 'డోలీ'ని సిద్ధం చేసి ఎక్కమనే సరికి ఆమె కర్థమయ్యింది తనని విధవని చెయ్యడానికి తీసుకెళ్ళనున్నారని. ఆ వూహకే కన్నీళ్ళు ఉప్పెనలా రాగా హెూరున భోరున ఏడ్చింది.

అయినా డోలీ ఎక్కక తప్పలేదు. దారి పొడవునా హృదయ విదారకంగా ఏడుస్తూనే వుంది చిన్నారి పొన్నారి ఇరవై రెండేళ్ళ సంధ్య!

మడుగు ప్రక్కన డోలీ దింపారు. నలుగురు విధవరాళ్ళు సంధ్యని తీసుకెళ్ళి ఓ రాతి బండమీద కూర్చోబెట్టారు. మొఖాన కాసంత బొట్టు పెట్టారు. చేతుల్నిండా గాజులు తొడిగారు. జడనిండా పూలు తురిమారు.

ఆ వెంటనే ఒకావిడ బొట్టు చెరిపేసింది. మరొకావిడ పూలని తీసి కాలితో

రాచేసింది. ఇంకో ఆవిడ రెండు చేతుల్నీ ఢీకొట్టి గాజుల్ని ముక్కలు చేసింది.

సంధ్య గుండెలు పగిలేలా రోధిస్తోన్నా లెక్క చెయ్యకుండా ఒకావిడ కుండెడు చన్నీళ్ళు ఆమె నెత్తిన గుమ్మరించి ఆ కుండని రాతికేసి కొట్టి ముక్కలు చేసింది. ఇంకో ఆవిడ తెల్లబట్ట కప్పింది!

తన రూపం తనకు వికృతంగా అన్పిస్తోంటే కన్నీళ్ళు కాల్వలు కట్టేలా ఈ క్రూర ఆచారాల్ని ప్రశ్నిస్తూ నిస్సహాయంగా సంధ్య విలపిస్తోంటే మళ్ళీ డోలీ కదిలింది.

అవును మరి. ఆడపిల్లకు కుంకుమనీ పువ్వుల్నీ గాజుల్నీ రంగు బట్టల్నీ ధరించే హక్కు పుట్టుకతోనే వస్తుంది. భర్త వస్తూ తెచ్చేవి కేవలం తాళీ, మట్టెలే అయినా వాటన్నిటినీ అపహరించి ఆమె జీవితంలోని నవ్వుల్నీ పువ్వుల్నీ కాలరాచి పచ్చదనాన్ని తగులబెట్టి ఆమెని విధవగా వికృతంగా తయారు చేస్తున్నాయ్ మన సాంప్రదాయాలూ, ఆచారాలూ! మనిషెంత నాగరికుడవుతోన్నా ఇంకా ఈ మూఢాచారాలు, ఎందరెందరో ఆడవాళ్ళని హత్యచేస్తున్నాయ్ జీవశ్చవాల్ని చేస్తున్నాయ్. దీనికంతం ఎప్పుడు?

సంధ్య కన్నీళ్ళు అడుగుతోన్న ప్రశ్నకి జవాబేమిటి?

ప్రొద్దెక్కేక కర్మకాండ మొదలయ్యింది.

ప్రొద్దుట్నుంచీ సంధ్య ఎవరికీ కన్పించకుండా గదిలో వుంచారు. ఎవరూ చూడకుండా, వెలుగు చొరబడకుండా గుమ్మానికి దుప్పటి కట్టారు.

లోపల ఆమె, ఆమె తల్లీ ఏడుస్తోంటే బయట హాల్లో పురోహితులు కర్మకాండ సాగిస్తున్నారు.

తదనంతరం కొందరాడవాళ్ళూ మగవాళ్ళూ నోట్లో జీలకర్ర వుంచుకుని, దుప్పటి తెర త్రోసి సంధ్యని చూస్తూ నోట్లోని జీలకర్రని వూశారు. వారి భావం 'ఛీ – విధవా' అని కాబోలు! జీలకర్రా బెల్లంలా కలిసుండమని పెళ్ళిలో దీవించారు కదూ. ఇప్పుడూ అందులో ఒకటి దూరమయ్యేసరికి రెండోవారి బ్రతుకు 'ఛీ' అయిపోయిందని అసహ్యించు కుంటున్నారు.

ఇటువంటి నరకం పగవాళ్ళకి కూడా వద్దనుకుంటూ ఏడ్వసాగింది సంధ్య.

చంద్రం పెద్దకర్మ అయిన వారం రోజులకి చంద్రం వదిన ప్రసవం కష్టమై తనువు చాలించింది. దాంతో చిన్నా పెద్దా అంతా ఒకనాడు మహాలక్ష్మి అని పొగిడినవాళ్ళూ మురిసిన వాళ్ళూ 'ముదనష్టపు జాతకురాలు' అంటూ నిందించ సాగారు సంధ్యని.

"దీపం ఆరేముందో సారి బాగా వెలిగినట్టు ముందు కాస్త పంటలవీ బాగా పండి కలిసొచ్చినా తర్వాత మొత్తం ఇంటి వెలుగునే మింగేసింది మహాతల్లి. కట్టుకున్న వాడలా అర్థాంతరంగా పోతే, పెద్ద కోడలిలా పోయింది. అంతా ఆవిడ కాలి మహత్యం" అంటూ మెటికలు విరుస్తాండగా తన బ్రతుకే ఒక హేళనై పోయిందనుకుంటూ పుట్టింటికి

ప్రయాణమయింది సంధ్య.

వాసు పెళ్ళికి ముహూర్తాలు ముందే పెట్టేసుకోవడమే గాక పెళ్ళి పనులు కూడా చాలా అవడం వల్ల ముహూర్తం మార్చడం ఎందుకని వూరుకోవడంతో, నిన్నటిదాకా ఏడ్పులతో ప్రతిధ్వనించిన ఇంట్లో ఇప్పుడు పెళ్ళికళ రూపుదిద్దుకోసాగింది.

'నువ్వే నా పెళ్ళి పనులన్నీ చెయ్యాలి, నువ్వు దగ్గర్లేకపోతే నేను పెళ్ళే చేసుకోను' అన్న వాసు ఇప్పుడు చెల్లెల్ని కనీసం పలకరించడమైనా లేదు. తల్లీ అక్కా కూడా పెళ్ళి పనుల్లో కలగజేసుకోనివ్వడం లేదామెను!

తన చెయ్యి తగిల్తే దాన్తోబాటు తన దురదృష్టమూ తగులుతుందని వాళ్ళ భావమని గ్రహించిన సంధ్య గదిలోంచి బయటికి రావడం మానుకుంది.

ఆడవాళ్ళంతా పట్టుబట్టలూ ఖరీదైన చీరలూ కట్టుకుని అందంగా అలంకరించుకుని అత్తర్లు పూసుకుని నవ్వుతూ తుళ్ళుతూ పరిహాసాలాడుకుంటూ పెళ్ళికెళ్తే సంధ్య ఒంటరిగా ఇంట్లో మిగిలిపోయింది.

* * *

సంధ్యకి జరిగిన అన్యాయం గురించి తెలిసి ఆమె స్నేహితురాండ్రు వచ్చి ఓదార్చారు. వెళ్ళేముందు "ఈ రోజుల్లో ఇలా అన్నీ వదులుకుని ముక్కు మూసుకుని మూలన కూర్చోవడం ఏమిటే. ఇక్కడుంటే ఇలాగే ఆంక్షలు విధిస్తారు గాని ఏ ఉద్యోగమో చూసుకుని టౌన్ కొచ్చేస్తే జరిగిన అన్యాయాన్ని కొంత వరకైనా పూడ్చుకోవచ్చు. పోయిన వాళ్ళతో మనమూ పోలేం కదా?" అన్నారు.

వాళ్ళెళ్ళేక ఆలోచిస్తే అదీ నిజమే అన్పించింది. ఇంతవరకూ నాలుగోవంతు జీవితం కూడా అనుభవించలేదు. మిగిలిన మూడువంతుల జీవితం కూడా ఇలాగే గడపాలంటే ఇంతకంటే నరకం ఏముంటుంది? నిజమే. చంద్రం అంటే ఇప్పటికీ తనకెంతో ప్రేమ వుంది. అలా అని ఇంత ఘోరశిక్షని భరించమనడం ఏం న్యాయం?

వీళ్ళనీ ఈ కట్టుబాట్లనీ ఎదిరించాలన్పించింది. ఆ వెంటనే ఏదో నిస్సహాయత ఆవరించింది. అయినా ధైర్యం పూర్తిగా సన్నగిల్లకపోవడంతో అద్దం కోసం వెదికింది.

ఇదివరకు నువ్వెంతో అందంగా వుంటావ్, నీ మొఖమే ఒక అద్దం అనే వాళ్ళిప్పుడు అద్దం తన కంటబడనివ్వడం లేదు. నీ వెంట్రుకలు చాలా పొడవు, భలే అదృష్టవంతురాలివే అన్నవాళ్ళిప్పుడు జడ వేసుకోనివ్వడం లేదు!

అద్దం దొరికింది. దాన్ని చాటుగా తనుంటోన్న 'వసారా'లోకి తెచ్చుకుని ఆతృతగా చూసుకుని తుళ్ళిపడింది.

చంద్రుడు లేని ఆకాశంలా ఆకులు లేని చెట్టులా కళ్ళు చెక్కని శిల్పంలా వుంది

మొఖం! మొఖం పీక్కుపోయి దవడ ఎముకలు కన్పిస్తున్నాయ్. కళ్ళు కొంచెం లోతుకు పోవడమే గాక కళ్ళ క్రింద నల్లని చారలు ఏర్పడ్డాయ్. తల అట్టలు కట్టినట్టుగా వుంది.

ఏమిటీ రూపు?! ఏమిటీ వాలకం?!

తన అందం ఆనందం అన్నీ ఆయన్తోనే సరా? ఆయన పోతే తన బ్రతుకే శూన్యమా? తనిప్పుడు జీవశ్చవమా?

దుఃఖం పొంగి వస్తోంటే మళీ మళ్ళీ చూసుకుంది అద్దంలో తన ప్రతిబింబాన్ని సంధ్య. ఎర్రబొట్టు నీకు చాలా అందం అంటోన్న భర్త మాటలు చెవిలో ప్రతిధ్వనించాయ్.

పోనీ ఒక్కసారి - ఒక్కసారి కుంకుమ ధరిస్తే?

ఆ ఆలోచన రావడం తరువాయి గబగబా వెదకి కుంకుమ బరిణె తెచ్చి బొట్టు పెట్టుకుని ఆత్రంగా చూసింది అద్దంలోకి.

మొఖంలోకి జీవకళ రావడం చూసి మురిసిపోయింది. తనకి కొత్త జన్మ వచ్చినంతగా సంతోష తరంగాల్లో ఈదులాడింది.

అంతలో అటువచ్చిన వాళ్ళమ్మ ఆమె బొట్టుని చూచి, "అయ్యో అయ్యో - ఇదేం పోయే కాలమే తల్లీ ఎవరైనా చూస్తే... హవ్వ ? మొఖం మీద వయ్యారూ? పదిమందిలోనూ అప్రతిష్ఠ కదూ?" గబగబా బొట్టు చెరిపేసి "ఇలాటి వెర్రిమొర్రి వేషాలెయ్యక కృష్ణా రామా అనుకుంటూ పడివుండు. నలుగురూ నవ్వుతారనైనా బుద్ధి తెచ్చుకో" అని తిట్టి వెళ్ళిపోయింది.

కన్నతల్లి చేసిన చేష్టకి సంధ్య గుండెలు వేయి వ్రక్కలయ్యాయ్!

తను కుంకుమ, పూలు ఏవీ ధరించకూడదు. నవ్వకూడదు. శుభకార్యాల్లో పాల్గోకూడదు. గడప దాటకూడదు. ఎవరికీ ఎదుర్రాకూడదు. మగవాళ్ళ కసలు కనబడకూడదు. యావజ్జీవ కారాగార శిక్ష పడ్డ ఖైదీలా ఇక్కడే ఆ వసారాలోనే కుళ్ళిపోవాలి చావుకోసం ఎదురు చూస్తూ చచ్చే వరకూ!

ఇంతకంటే సతీసహగమనం నయం కాదూ?

దానివల్ల ఒక్కరోజే కొన్ని గంటలే నరకయాతనైతే దీనివల్ల జీవితాంతమూ నరకయాతనే. ఇక ఆంక్షల గురించీ బుగ్గలు నొక్కుకోవడాల గురించీ విసుగుళ్ల గురించీ చెప్పేదేముంది?

కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది సంధ్య!

* * *

చంద్రం టాక్సీలో వచ్చాడు అత్తవారింటికి. తలకి కట్లు కట్టుకుని వున్నాడు. ఆతృతగా లోపలికొచ్చిన అతడ్ని నిశ్చేష్టులై చూస్తూండి పోయారంతా.

క్రితం నెలలో భార్యపోయిన తన పెద్ద కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేస్తున్నామని చెప్పడానికొచ్చిన చంద్రం నాన్నగారు కూడా అలాగే చూస్తూండిపోయారు గుడ్లప్పగించి.

"ఏమిటలా చూస్తున్నారు? సంధ్య ఏది – సంధ్యా! సంధ్యా!"

లోపల వసారాలో విలపిస్తూ కూర్చున్న సంధ్య చెవులకా మాటలు అమృతపు సోనల్లా తాకాయ్. పరుగున హాల్లోకొచ్చి భర్తని చూసి శిలాప్రతిమైపోతే, విధవ వేషంలో ఉన్న భార్యని చూసి షాక్ తగిలినట్లు ఫీలయ్యాడు చంద్రం.

"మీరు... మీరు..." సంధ్య తడబడుతూ అంది.

"నేను బ్రతికే వున్నాను సంధ్యా. ఈ ఘోరం ఎలా జరిగింది. ఎవరు చేశారు సంధ్యా?" ఆమె రూపాన్ని చూసి ఆవేదనతో అడిగాడు.

"రైలు యాక్సిడెంట్ ... మీ పర్స్..."

"ఆ పర్స్ వున్నతను చనిపోతే నేను పోయాననుకున్నారా?"

తలూపిందామె.

"మై గాడ్! నా పర్స్ నెవరో దొంగ వెధవ కాజెయ్యడంతో, రైల్వేస్టేషన్నుంచి మా ఫ్రండ్ రూమ్కి ఆటోలో వెళ్తోంటే సిటీబస్సు గుద్ది యాక్సిడెంట్ అయ్యింది. నాకు తీవ్రంగా గాయాలు తగలడంతో ఈ నెల రోజులూ ఆసుపత్రిలోనే వున్నాను. 20 రోజుల వరకూ నాకు స్పృహ రాకపోవడంతో నేను మీ ఎడ్రస్ ఇవ్వలేకపోయాను..."

"అయ్యో ఎంత ఘోరం జరిగిపోయింది" అని అంతా దగ్గిరికొచ్చి జరిగిందానికి బాధపడుతూ అతడు తిరిగొచ్చినందుకు సంతోషపడుతోంటే, సంధ్య లోపలికి పరుగెత్తి, తెల్లచీర చింపి పారేసి పట్టుచీర కట్టుకుని, పెరట్లో వాసు భార్య మల్లెలు గుచ్చుతూంటే ఆ దండలన్నీ లాక్కుని తలలో పెట్టుకుని, కుంకుమ భరిణెతో హాల్లోకి పరుగెత్తు కొచ్చి గుమ్మంలో ఆగిపోయింది భర్తని పరమానందంగా చూస్తూ!

ఆమె సర్వావయవాలూ ఆనందంతో తొణికిసలాడుతున్నాయ్. మొఖం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఆమెలో వుద్వేగం క్షణక్షణానికీ అధికమై పోతోంది. బి.పి. వచ్చే సూచనలు కూడా కన్పిస్తున్నాయి గాని ఆమె లెక్క చేసే స్థితిలో లేదు. ఇన్నాళ్ళూ తను దూరమైన పువ్వుల్నీ కుంకుమనీ చేజిక్కించుకోవాలి–ఇన్నాళ్ళూ తనని అశుభచిహ్నంగా చూసిన అందరినీ గర్వంగా చూడాలి–ఇన్నాళ్లూ అనుభవించిన ఘోర నరక జీవితానికి భరత వాక్యం పలకాలి–అన్న తపనతో ఆతృతతో ఆరాటంతో వేగిపోతూ మెల్లగా అడుగు వేస్తూ భర్త దగ్గరికి నడిచి కుంకుమ భరిణె అందించింది.

చంద్రం ఆమె నుదుట కాసంత బొట్టు పెట్టాడు.

ఆమె హద్దులు దాటిన ఆనందంతో గుండెల్ని పట్టుకుంటూ అతడి కాళ్ళమీద పడిపోయింది. అతడు లేపినా లేవకపోయేసరికి అనుమానం వచ్చి నాడి చూశాడు. బీపీ

పుణ్యమా అని ఆమె ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

'అయ్యో పాపం' అంటూ ఏడ్చారంతా.

"ఏం? ఎందుకేడుస్తున్నారు? సంధ్య ఇప్పుడు కాదు ఆమెని విధవని చేసినప్పుడే చనిపోయింది. కాదు మీరూ మీరూ మీరూ – మీరంతా కలిసి హత్య చేశారు. మీ నమ్మకాలకి ఆచారాలకి సంధ్య పండంటి బ్రతుకుని బలిచేశారు. పెళ్ళాం పోయిన మగాడు నెల తిరక్కుండా పెళ్ళి పీటల మీద కూర్చొంటోంటే, మగడు పోయిన ఆడదానికెందుకు మళ్ళీ పెళ్ళి చెయ్యకూడదు? ఆమెనెందుకలా విధవగా దిష్టిబొమ్మగా చేసి మూలన కూర్చోబెడుతున్నారు? ఆమె పచ్చని బ్రతుకులో నిప్పులు పొయ్యడానికి మీకెవరిచ్చా రధికారం? చెప్పండి – మాట్లాడరేం? నా భార్యని బ్రతికించండి. ఆమెని బ్రతికించలేని వాళ్ళామెనెందుకు చంపేరు? భర్తపోతే భార్యకింక బ్రతుకే లేదా? అతడితో బాటు ఆవిడా చావాల్సిందే? ఇదేనా న్యాయం? ఇలా చెయ్యమని ఏ దేవుడు ఏ మతం చెప్పింది? మీ కళ్ళముందిలా ఎందరో అభాగ్య ఆడపిల్లలు కుళ్ళి కుళ్ళి చావడం చూస్తూ కూడా ఇలా ఎలా చెయ్యగలుగుతున్నారు? మీ మూఢత్వం బ్రద్దలయ్యే దెప్పుడు? స్త్రీకి వీటినుండి మోక్షం ఎప్పుడు? ఎప్పుడు?" చంద్రం ఆవేదనతో ఆక్రోశిస్తున్నాడు.

అవును –

స్త్రీకి ఈ అమానుష కర్మకాండ నుంచి విముక్తి ఎప్పుడు?

* * *

**(స్వాతి మాస పత్రిక, ఏప్రియల్ 1979)**